క్లుప్తంగా

మెన్నిపాడులో వైద్య శిబిరం



ఉండవెల్లి: మండలంలోని మెన్నిపాడులో ఎస్‌బీఐ సంజీవని, భవిష్య భారత్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. 200 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చంద్రయ్య,నాగరాజు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మల్దకల్: ఫర్టిలైజర్ షాపు యజమానులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మేకలసోంపల్లి, బిజ్వారం, మల్దకల్‌లో ఫర్టిలైజర్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వాహకులు, రైతులకు ఎరువులను విక్రయించిన వెంటనే రశీదులను ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు. అలాగే వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

'కుక్కల బెడద నివారించండి'

కేటీదొడ్డి: మండలంలోని ఎర్సందొడ్డిలో కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి రాముకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉందని, ఇప్పటికి ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి కరిచాయని తెలిపారు. కుక్కల నుంచి గ్రామస్తులను కాపాడాలని కోరారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జీరో పాయింట్ మిషన్ భగీరథ హెడ్ వర్క్స్ వద్ద శనివారం నీటిశుద్ధి కేంద్రాన్ని శుభ్రం చేయనుండడంతో శనివారం జిల్లాలోని ఆయా మండలాలకు తాగునీటి సరఫరా ఉండదని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవిచంద్ర కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం యథావిధిగా నీటి సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

పదవీ విరమణ వారి సేవలకు గుర్తింపు

ఎర్రవల్లిచౌరస్తా: పదవీ విరమణ అనేది వారు చేసిన సేవలకు గుర్తింపని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అజేయుడు అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించి ఎంఈఓ రాజు పదవీ విరమణ కార్యక్రమానికి ఇరువురు హాజరై ఎంఈఓ దంపతులకు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

పర్యావరణాన్ని కాపాడాలి



కేటీదొడ్డి: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని గురు శంభు లింగేశ్వర స్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని నందిన్నెలోని శంభులింగేశ్వర స్వామి మఠంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మొక్కలతోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. మనిషికి ప్రాణవాయువును అందిస్తాయన్నారు.

పలు దుకాణాల్లో చోరీకి యత్నం



రాజోళి: మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని పలు చోట్ల వ్యాపారాల నిమిత్తం ఏర్పాటు చేసుకున్న దుకాణాల్లో గురువారం చోరీకి యత్నించారు. కూల్‌డ్రింక్ షాపులో రూ.3 వేల నగదును, మరొక షాపులో సిగరెట్లు, బీడీలు ఎత్తుకెళ్లారు. జిరాక్స్ షాపులో చోరీకి యత్నించి విఫలమయ్యారు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

రోగులకు వైద్యం అందేనా?



పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తున్న పీహెచ్‌సీ ప్రాంగణం

- ప్రభుత్వ వైద్యశాలలో కొరవడిన వైద్య సేవలు
- వడ్డేపల్లి పీహెచ్‌సీలో వైద్యుడు లేని వైనం

శాంతినగర్: నిరుపేదలకు వైద్య సేవలు అందించే ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది, మాత్రల కొరతతో వైద్యం దైవాదీనంగా మారింది. అంతేగాక మౌలిక వసతులు లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో నిత్యం వందకుపైగా ఓపీ ఉండాల్సింది 40కి పడిపోయింది. వడ్డేపల్లి మున్సిపల్ కేంద్రంలో నెలకొల్పిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడంతో ఎల్లప్పుడు రోగులు, సహాయకులతో నిండుగా కనిపించేది. ఐదేళ్ల కాలంలో సిబ్బంది సరిగాలేక, రోగులకు ఇచ్చే మాత్రలు లేక, మౌలిక వసతులు లేక రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అంతేగాక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు మందులు లేవని, డాక్టర్‌లేదని ప్రైవేట్ ఆస్పత్రులకు, మెడికల్ షాపులకు రెఫర్ చేస్తున్నారు.

ఆరు నెలలుగా ఇన్‌చార్జ్ డాక్టర్

వడ్డేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు నెలలుగా డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. రాజోళి పీహెచ్‌సీ డాక్టర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. డాక్టర్ ప్రతి నిత్యం రాజోళిలో రోగులను పరీక్షించడంతో వడ్డేపల్లికి సరిగా రావడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పల్లెదవాఖాన సిబ్బంది వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితులు దాపురించాయి.

మండల కేంద్రంగా దూరంగా పీహెచ్‌సీ

మండల కేంద్రమైన శాంతినగర్‌కు వడ్డేపల్లి పీహెచ్‌సీ దూరంగా ఉండటం, రవాణా సౌకర్యం లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శాంతినగర్ నుంచి కిలోమీటర్‌కు పైగా పీహెచ్‌సీ ఉండటంతో అనారోగ్యంగా వున్న రోగులు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పదులసంఖ్యలో ప్రైవేట్ ఆస్పత్రులు

ప్రభుత్వ దవాణాలో 24 గంటల సేవలు అందించాలని ఉన్నా వైద్యం సరిగా అందకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నారు. దీంతో కేవలం శాంతినగర్‌లోనే పదుల సంఖ్యలో ప్రైవేట్ ఆసుపత్రులు వెలిశాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఆర్‌ఎంపీలు సైతం ఆస్పతులు నడుపుతున్నారు.

వైద్య సిబ్బంది లేక..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన వైద్య సిబ్బంది లేరు. 4 ఏఎస్‌ఎంలు, స్టాఫ్ నర్సు, వైద్యుడు లేకపోవడంతో సేవలు అందడం లేదు. అదేవిధంగా రోగులకు, సహాయకుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు నీటి సౌకర్యంలేక నిరుపయోగంగా మారాయి. పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. అంతేగాక గతంలో స్లాబ్ పనులు చేసిన కాంట్రాక్టర్ చెత్తను అక్కడే వదిలి వెళ్లడంతో పాములకు ఆవాసంగా మారిందని రోగులు చెబుతున్నారు.



అసౌకర్యాలతో ఉన్న వడ్డేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

నీటి సౌకర్యం లేదు



రోగులకు, సహాయకులకు మూత్రశాలలు ఆరుబయటికి వెళ్లాల్సి వస్తోంది. ఆస్పత్రి ఆవరణలో మూత్రశాలలు నిర్మించినప్పటికి నీళ్లు లేక, మరమ్మతులకు నోచుకోక ఉపయోగపడటంలేదు. పైన ఉన్న ట్యాంక్ పగిలిపోయిందని, నీళ్లు రావని సిబ్బంది చెబుతున్నారు. మహిళలకు చాలా ఇబ్బందిగా ఉంది.

– మరియమ్మ, శాంతినగర్

డాక్టరే లేడు..



ఆస్పత్రిలో డాక్టర్ లేడంటున్నారు. సిబ్బందితో ఎలా చూయించుకునేది. ధర్మాసుపత్రి బాగుంటుందని వచ్చాము. ఇక్కడ చూస్తే ఎవరూ లేరు. అందరూ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నారు.. ఎందుకని అడిగితే చెప్పిన సమాధానాలు నిజమని తెలుస్తోంది. ఇలాగైతే ఆసుపత్రికి ఎవరూ రారు. అంతేగాక మాత్రలు అన్నీ లేవని, ప్రైవేట్ మెడికల్ షాపులకు రాసి ఇస్తున్నారు. చిన్న మందులు లేవంటే నిరుపేదల పరిస్థితి ఏమి.

– అంజనేయులు, శాంతినగర్

సిబ్బంది కొరత వాస్తవమే



సిబ్బంది కొరత ఉంది. ఉన్న వారితోనే వైద్య సేవలు అందిస్తున్నాం. డాక్టర్ రాజోళి నుంచి వచ్చివెళ్తుంటారు. మాత్రలు కొన్ని తక్కువగా వచ్చాయి. ఇండెంట్ పెట్టాం. పీహెచ్‌సీ సమస్యల గురించి ఉన్నతాధికారులకు వివరించాం.

– షబ్బీర్ హుస్సేన్, సీహెచ్‌ఓ, వడ్డేపల్లి పీహెచ్‌సీ

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి



నిరసనలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: మండల కేంద్రానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని, ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు బీసీ, ఎస్సీ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వివిధ కళాశాలల విద్యార్థులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కూర్చొని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యా సంస్థలను మెరుగుపర్చడంలేదని, డిగ్రీ కళాశాల మంజూరు చేయడం లేదని, కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతిని కల్పించడం లేదని విద్యార్థులు వాపోయారు. బీజేపీ నాయకులు అక్కడకు చేరుకొని విద్యార్థులకు మద్దతు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 64 మండలాల్లో అయిజ అతిపెద్ద మండలమని పేర్కొన్నారు. ఈ మండలంలో లక్షకు పైగా జనాభా ఉందని, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మూడు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, రెండు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయని, రెండు ప్రభుత్వ హైస్కూళ్లు, 14 ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తున్నారని తెలిపారు. గట్టు, రాజోళి, వడ్డేపల్లి మండలాల విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఇక్కడే చదువుతున్నారని, హాస్టల్ వసతులు లేనందున ఉన్నత విద్యకు దూరమవుతున్నారని వాపోయారు. అనంతరం ఎంపీడీఓ, ఎంపీపీలకు వినతిపత్రం ఇచ్చారు.

ఆఖరి సభలో సమస్యల వెల్లువ



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి

అయిజ: మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆఖరి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి అధ్యక్షతన వైస్ ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఎంపీడీఓ వెంకటయ్య మండల సర్వసభ్య సమావేశం కొనసాగింది. కార్యక్రమానికి హాజరైన వివిధ శాఖల అధికారులు ఎజెండాను చదివి వినిపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యం పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, ఇతర వస్తువులు విక్రయిస్తున్నారని, అధికారులు పట్టించుకోవడంలేదని సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఉన్నత విద్యాధికారిని కలిసి ప్రత్యేక అనుమతులు తీసుకొచ్చారని, ఎమ్మార్పీ రేటుకు పుస్తకాలు విక్రయించే అవకాశం లభించిందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్‌ను పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లకుండా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారని, అంగన్‌వాడీ టీచర్లు చొరవ తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులు చేరేలా కృషి చేయాలని ఎంపీపీ కోరారు. సర్పంచ్‌ల పదవి కాలం పూర్తయ్యి నెలలు గడుస్తున్నా వారు గతంలో చేపట్టి పూర్తిచేసిన పనులకు ఇంత వరకు బిల్లులు రాలేదని, వెంటనే మంజూరు చేయాలని మాజీ సర్పంచ్‌లు ఎంపీపీకి, ఎంపీడీఓకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఎంపీటీసీలకు మండల పరిషత్ అధికారులు శాలువాలు కప్పి సన్మానం చేశారు.

ప్రతి వారం వీసీ ద్వారా రైతులకు సూచనలు



మానవపాడులో వీసీ పరికరాలను పరిశీలిస్తున్న ఏడీఏ సక్రియానాయక్

మానవపాడు: అలంపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన పరికరాలను అందించామని ఏడీఏ సక్రియానాయక్ తెలిపారు. శుక్రవారం ఆయా మండలాలకు రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. వీసీ ద్వారా ద్వారా రైతులకు నేరుగా రైతునేస్తంలో భాగంగా పంటలకు కావాల్సిన యజమాన్య పద్ధతులు, అలాగే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడానికి సూచనలు, సలహాలు, ప్రభుత్వ పథకాలు తెలియజేస్తామన్నారు. రైతులకు సందేహాలు వచ్చినప్పుడు వ్యవసాయ అధికారులకు, పరిశోధన స్థానాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రతి మంగళవారం నిర్వహించే వీసీలో పాల్గొన్ని సందేహాలను నివృతి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాశ్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ భరత్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం రైతు వేదికలో శుక్రవారం రైతులకు నానో యూరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి భరత్ రైతులకు నానో యూరియా వాడకం వల్ల పంటల్లో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నానో యూరియా పర్యావరణానికి ఎలాంటి హాని చేయకుండా పంటలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దీని వాడకం వల్ల పంట ఉత్పత్తి, పెరుగుదల నాణ్యత ఎక్కువగా ఉంటుందన్నారు. దీనికి రవాణాతో పాటు నిల్వ ఖర్చులు తక్కువన్నారు. తక్కువ నత్రజని అవసరమయ్యే పంటల్లో లీటర్ నీటికి 2 ఎంఎల్, ఎక్కువ నత్రజని అవసరమయ్యే పంటల్లో 4 ఎంఎల్ చొప్పున పిచికారి చేయాలని సూచించారు.

సింగిల్ రోడ్డు.. డబుల్ కష్టాలు



ఉండవెల్లి నుంచి హైవేకు వెళ్లే మార్గంలో గుంతలమయంగా సింగిల్ రోడ్డు

- రద్దీగా జాతీయ రహదారి నుంచి ఉండవెల్లి రోడ్డు
- పెరిగిన వాహనాల రాకపోకలు
- రోడ్డు విస్తరణపై పట్టింపు కరువు
- ఇబ్బందులో వాహనచోదకులు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారి నుంచి ఉండవెల్లికి వెళ్లే రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఐదేళ్ల క్రితం మట్టి రోడ్డుగా ఉన్న ఈ దారిని 10 కిలోమీటర్ల మేర బీటీగా గత ప్రభుత్వం అభివృద్ధి చేసింది. అప్పుడు ఈ సింగిల్ రోడ్డు అవసరాలకు అనుగుణంగా ఎంతో ఉపయోగపడింది. ప్రస్తుతం ట్రాఫిక్ పెరిగింది. దీంతో ఈ రహదారిపై వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ రోడ్డును డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేయాలని కొన్నేళ్లుగా ప్రభుత్వానికి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శిథిలావస్థకు బ్రిడ్జి..

జాతీయ రహదారి నుంచి ఉండవెల్లికి వెళ్లే మార్గంలో మధ్యలో బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో చుట్టు పక్కల గ్రామాల వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఉండవెల్లి, కంచుపాడు, చిన్న ఆముదాలపాడు, తక్కశిల, ప్రాగటూరు, శేరుపల్లె, మారమునగాల–1, 2 గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జి దాటే వెళ్లాలి. కాని బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో వాహనదారులు భయంభయంగా ప్రయాణిస్తున్నారు. సమస్య పట్టించుకోవాలని అధికారులకు విన్నవించినా పట్టింపులేదు. కొన్నిసార్లు ఆటో యునియన్ సభ్యులు మట్టిని వేశారు. మరోసారి కాంట్రాక్టర్ మరమ్మతులు చేశారు. ప్రస్తుతం భారీ వాహనాలు, ట్రాక్టర్లు వచ్చినా ఎక్కడ ప్రమాదం జరుగుతుందో తెలియక ఆవేదన చెందుతున్నారు.

లోడుతో వెళ్తే ఇబ్బందులే..

ఉండవెల్లి నుంచి జాతీయ రహదారికి చేరాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఏదైనా వాహనాలు లోడుతో వెళ్తే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సింగల్ రోడ్డు కావడంతో ఎదురుగా వాహనం వస్తే కిందికి దిగలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వ అధికారులు ఈ రోడ్డును పరిశీలించి రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసి సమస్య పరిష్కరించాలి.

– గుణవర్ధన్‌గౌడు, కంచుపాడు

ప్రయాణికులకు ఇబ్బందులే..

జాతీయ రహదారి నుంచి ఉండవెల్లికి వెళ్లే మార్గంలో వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కానీ ఎలాంటి ఆదేశాలు రాలేదు. వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– భరత్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ



శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

వసతి గృహం నిర్మించండి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహానికి సొంత స్థలం ఉన్నా, భవనం శిథిలావస్థకు చేరడంతో అద్దెకు తీసుకున్నారని కేవీపీఎస్ జిల్లా ప్రదాన కార్యదర్శి రాజు అన్నారు. శుక్రవారం ఎస్సీ హాస్టల్‌ను నాయకులు పరిశీలించారు. విద్యార్థుల భోజనాన్ని, నిద్రించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. త్వరగా వసతి గృహాన్ని ఉన్నతాధికారులు పరిశీలించి కొత్త భవనాన్ని నిర్మించాలని సూచించారు.

పంటల నమోదు

మానవపాడు: సాగు చేసిన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నమోదు చేసుకుంటున్నామని ఏడీఏ సక్రియనాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని క్లస్టర్ నందు పంటపొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు విత్తనాలను విత్తేటప్పుడు తేమశాతం చూసుకోవాలని తెలిపారు. పంటల నమోదు పోర్టల్ కార్యక్రమం ఈ వారం నుంచే ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

బీచుపల్లిలో కుంకుమార్చన

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు సరస్వతీదేవిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మల్దకల్: బీపీ, షుగర్‌తో పాటు వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్ స్వరూపరాణి వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో బీపీ, షుగర్ ఉన్న వారి వివరాలను రికార్డులలో పొందుపరిచి నెలనెల క్రమం తప్పకుండా మందులు అందజేయాలన్నారు. అదే విధంగా గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతకు పాటుపడటంతో పాటు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రహదారికి ఇరువైపులా ఆహ్లాదం



ఉండవెల్లి: మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డుకు ఇరువైపుల హరితహారంలో భాగంగా మూడేళ్ల క్రితం నాటిన మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మొక్కలు కాస్తా చెట్లుగా మారి పచ్చదనంతో ప్రయాణికులకు నీడనిస్తున్నాయి.

'సింగరేణి' ప్రైవేటీకరణను ఆపాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

అమరచింత: సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఆపాలంటూ శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ తెలంగాణకు బంగారు గనిగా ఉన్న సింగరేణిని బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసేందుకు చర్యలను వేగవంతం చేసేందని విమర్శించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలో సింగరేణి వేలం ద్వారా టెండర్లను ఆహ్వానించడంతో ప్రైవేట్ ప్రక్రియ వేగవంతంగా చేయడానికి రంగం సిద్ధం చేసిందన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేందుకే పనిచేస్తుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ రమేష్, అజయ్, శ్యాంసుందర్, నరసింహ, విష్ణు, పాషా, ఆటో రాము పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సమగ్ర చట్టం తీసుకురావాలి



ఆత్మకూర్: దేశంలో అత్యధికంగా ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం కొసాగిస్తున్నారని, వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్మికులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందించారు. వ్యవసాయ కూలీలకు రూ.600 కూలి, ఇన్సూరెన్స్, బీమా అమలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.12 వేలు జీవనభృతి కల్పించాలని, 50ఏళ్లు దాటిన వారికి రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.